## టిడిపి అభ్యున్నతికి కృషి చేయాలి: గన్ని

ప్రజాశక్తి - భీమడోలు

తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని గన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల పొత్తులో భాగంగా బరిలో ఉన్న జనసేన అభ్యర్థి పి.ధర్మరాజు విజయానికి టిడిపి కార్యకర్తలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేన్సర్.. కలవరం..!

- రెండు జిల్లాల్లో చాప కింద నీరులా చుట్టేస్తున్న మహమ్మారి
- బ్రెస్ట్, బోన్, పెద్దపేగు, గొంతు, బ్లడ్ కేన్సర్ల బారిన జనం
- ఏలూరు కేన్సర్ ఆసుపత్రిలో ఒపి రోగులు రోజుకు 150కిపైనే
- జనాలకు రోగంపై అవగాహన కల్పనలో ప్రభుత్వాలు విఫలం
- కీమోలకు మాత్రమే ఆరోగ్యశ్రీ, టెస్టుల కింద రూ.50 వేల వరకూ బాదుడు

'పాలకొల్లు సమీప గ్రామానికి చెందిన 60 ఏళ్ల వ్యక్తికి పెద్దప్రేగు కేన్సర్ బారిన పడ్డారు. హైదరాబాద్‌లోని ప్రముఖ కేన్సర్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. మందులు, కీమోలు తీసుకున్నా, ఏడాదిన్నర తర్వాత మనిషి దూరమైన పరిస్థితి. కేన్సర్ సోకినట్లు నిర్ధారణయ్యేసరికి రోగం ముదిరిపోయినట్లు చెబుతున్నారు. గ్రామంలో ఉంటూ, ఎటువంటి అనారోగ్య సమస్యలు లేని వ్యక్తికి ఈ కేన్సర్ రావడమేమిటో ఎవరికీ అంతుబట్టడం లేదు'.

'ఏలూరులోని 45 ఏళ్ల మహళ రొమ్ము కేన్సర్ బారిన పడింది. ఆదిలోనే గుర్తించడంతో నెలలు తరబడి చికిత్స తీసుకుని అతికష్టంపై బయటపడింది. చికిత్స కాలంలో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అయితే రోగం ఎందుకు వచ్చిందో తెలియదు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కేన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటం తీవ్రంగా కలవర పెడుతోంది. కేన్సర్‌పై జనాలకు సరైన అవగాహన లేకపోవడంతో రోగం బారిన పడ్డ వ్యక్తులు మృత్యుఒడికే అన్నట్లు పరిస్థితి తయారైంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా కేన్సర్ రోగం చుట్టుముట్టేస్తోంది. ఏలూరు ప్రాంతంలోని కేన్సర్ ఆసుపత్రికి రోజుకు సరాసరిన 150 మంది అవుట్‌పేషెంట్లుగా, దాదాపు 30 నుంచి 40 మంది ఇన్‌పేషెంట్లుగా రోగులు చేరుతున్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇంకా భీమవరం, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్‌లోని కేన్సర్ ఆసుపత్రులకు జిల్లాలోని రోగులు చికిత్స కోసం పెద్దఎత్తున తరలివెళ్తున్నారు. గతంలో గ్రామాల్లో ఎవరికో ఒకరికి కేన్సర్ వస్తే వింతగా చెప్పుకునేవారు. ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ పెద్దఎత్తున కేన్సర్ రోగులు పెరుగుతున్న పరిస్థితి. ఈ రోగం నిర్ధారణ అయ్యేసరికి పరిస్థితి చేయి దాటిపోతుంది. కేన్సర్‌ను ఎలా గుర్తించాలి, ముందుగా శరీరంలో ఎటువంటి మార్పులూ కన్పిస్తాయి వంటి వాటిపై ప్రభుత్వం కనీస అవగాహన సైతం కల్పించడం లేదు. జిల్లాలో ఎక్కువగా రొమ్ము (బ్రెస్ట్), బోన్, పెద్దప్రేగు, గొంతు, బ్లడ్ కేన్సర్ల బారిన పడుతున్నారు. రొమ్ము కేన్సర్ విషయంలో ఆదిలోనే గుర్తించే అవకాశం ఉండటంతో కోలుకుంటున్న వారి శాతం కొంత మెరుగ్గా కన్పిస్తోంది. మిగిలిన కేన్సర్ల బారిన పడితే మాత్రం పరిస్థితి ఏమిటో అర్థం కాకుండా పోతుంది. జిల్లాలో కేన్సర్ రోగం ఇంతవేగంగా విస్తరించడానికి కారణాలు ఏమిటనే విషయంపై ఇప్పటికీ గుర్తించిన పరిస్థితి లేకుండాపోయింది. జీవన విధానంలో మార్పులా.. తినే ఆహారంలో సమస్యా అనేది తెలియని పరిస్థితి నెలకొంది. కేన్సర్ బారిన పడకుండా ఉండాలంటే ముందస్తు చర్యలు ఏమిటనే అవగాహన సైతం జనాలకు కల్పించే ప్రయత్నం జరగడం లేదు. కేన్సర్ బారిన పడ్డ రోగుల బాధలు వర్ణణాతీతం.

### ఆర్థికంగా సామాన్య ప్రజానీకం విలవిల

కేన్సర్ బారిన పడుతున్న సామాన్య ప్రజానీకం పరిస్థితి దుర్భరంగా మారుతోంది. కేన్సర్ రోగులకు కీమో థెరపీ, కరెంటు పెట్టడం వంటి చికిత్సలు ఆరోగ్యశ్రీలో ఉన్నాయి. అయితే కేన్సర్ గుర్తించేందుకు చేస్తున్న టెస్టులు మాత్రం ఆరోగ్యశ్రీలో లేకుండాపోయాయి. దీంతో బోన్‌మోరోతోపాటు ఇతర టెస్టులకు పెద్దఎత్తున ఖర్చవుతోంది. కేన్సర్ నిర్ధారణయ్యేసరికి టెస్టులు, మందుల కింద కనీసం రూ.50 వేలుపైనే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆ తర్వాత కీమోలకు మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తున్నారు. దీర్ఘకాలిక రోగం కావడంతో ఆసుపత్రుల చుట్టూ తిరగడం, మందుల కొనుగోలుకు రూ.వేలల్లో ఖర్చవుతోంది. దీంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్న, చిరుద్యోగుల కుటుంబాలు ఖర్చు తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. కేన్సర్ రోగానికి సంబంధించిన టెస్టులు అన్నింటికీ ఆరోగ్యశ్రీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. అంతేకాకుండా రెండు జిల్లాల్లో కేన్సర్ ఇంత వేగంగా విస్తరించడానికి కారణాలు తేల్చి, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సి అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# నాడు కౌన్సిలర్లు.. నేడు ఎంపీ అభ్యర్థులు..!

వారిద్దరూ భీమవరం వాసులే.. నాడు కౌన్సిలర్లుగా పని చేశారు.. నేడు ఎంపీ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. వారే నరసాపురం వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ. గతంలో కాంగ్రెస్ నుంచి ఉమాబాల, బిజెపి నుంచి శ్రీనివాస్‌వర్మ ఎన్నికయ్యారు. నాటి నుంచి నేటి వరకు రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న ఈ ఇరువురి మధ్య ప్రధాన పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది.

- నరసాపురం ఎంపీ స్థానానికి వైసిపి నుంచి గూడూరి ఉమాబాల, బిజెపి నుంచి శ్రీనివాస్‌వర్మ
- ఇరువురు గతంలో భీమవరం మున్సిపల్ కౌన్సిలర్లు
- రసవత్తరంగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

ఊహించని పరిణామాలకు కేరాఫ్ అడ్రస్ రాజకీయం. ఏ నిమిషంలో ఏమి జరుగుతుందో ఊహించడం ఎవరి తరం కాదు. అన్నీ తానే అనుకున్న వారికి రాజకీయాల్లో నిలువ నీడ లేకపోవచ్చు.. ఎవరూ ఊహించని వారిని రాజకీయ పదవులు వరించొచ్చు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు స్థానంతో పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలు ఉండగా ప్రస్తుతం జిల్లాలో నర్సాపురం మాత్రమే ఏకైక స్థానంగా ఉంది. గతంలో ఈ స్థానానికి జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే కాపులు, క్షత్రియులు మాత్రమే తలపడేవారు. ఈ స్థానం నుంచి ఎంపీలుగా పోటీ చేసేందుకు వేరే సామాజిక తరగతికి అవకాశం దక్కలేదు. అయితే తొలిసారి నరసాపురం ఎంపీ స్థానం నుంచి వైసిపి అభ్యర్థిగా బిసి మహిళ గూడూరి ఉమాబాల రంగంలోకి దిగారు. బిజెపి అభ్యర్థిగా క్షత్రియ సామాజిక తరగతికి చెందిన భూపతిరాజు శ్రీనివాస వర్మ పేరు ఖరారైంది. ఇరువురు అభ్యర్థులు జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలో నరసయ్య అగ్రహారం, చినరంగనిపాలెం ప్రాంతాలకు చెందినవారే కావడం విశేషం. ఇరువురు ఉన్నత విద్యావంతులు కావడంతోపాటు రాజకీయాల్లో ఆయా పార్టీలో దిగువ స్థాయి నుంచి నాయకత్వ స్థాయికి ఎదిగారు. అయితే ఇరువురు అనూహ్యంగానే టిక్కెట్‌లను దక్కించుకోవడం విశేషం. మరో విశేషం ఏమిటంటే ఇద్దరూ భీమవరం మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కూడా. ఉమాబాల 1995-2000 మధ్యకాలంలో కాంగ్రెస్ తరపున కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీనివాసవర్మ 2014-2019 మధ్యకాలంలో బిజెపి తరపున కౌన్సిలర్‌గా పని చేశారు. ఇదిలా ఉంటే భీమవరం మున్సిపాలిటీ నుంచి చట్టసభలకు వెళ్లేందుకు ప్రత్యక్ష ఎన్నికల్లో పలువురు నేతలు గతంలో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మున్సిపల్ మాజీ ఛైర్మన్లు బొమ్మిడి నారాయణరావు నరసాపురం అసెంబ్లీ స్థానం నుంచి, తోట సీతారామలక్ష్మి నరసాపురం పార్లమెంటు స్థానం నుంచి టిడిపి తరపున పోటీ చేసి గతంలో ఓటమి పాలయ్యారు. 2009లో ప్రస్తుత బిజెపి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ కూడా పోటీ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అయితే భీమవరం మున్సిపల్ మాజీ కౌన్సిలర్, కీర్తిశేషులు మెంటే పద్మనాభం, మాజీ ఛైర్‌పర్సన్ తోట సీతారామలక్ష్మి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం వైసిపి, బిజెపి అభ్యర్థుల్లో ఎవరు గెలిచినా పార్లమెంట్‌కు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా వెళ్లినవారిగా రికార్డు సృష్టిస్తారు. ఉమాబాల గెలుపొందితే మరో రికార్డు కూడా అవుతుంది. నరసాపురం ఎంపీగా ఎన్నికైన తొలి మహిళగానూ, అందులోను బిసి మహిళగాను చరిత్ర సృష్టించనున్నారు. దీంతో నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది.

వైసిపి ఎంపీ అభ్యర్థి ఉమాబాల

బిజెపి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ వర్మ

# ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన సిఇఒ

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఏలూరు విచ్చేశారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాలో ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. దీనిపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులకు సంబంధించిన వివరాలు కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారులకు చేరవేస్తారని, తర్వాత చర్యలు తీసుకుంటారని వివరించారు. అనంతరం సోషల్ మీడియాలో వచ్చే అంశాలపై సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా ఏ విధంగా వాటిని పరిష్కరిస్తున్నదీ సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై సోషల్ మీడియాను పర్యవేక్షిస్తున్న ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్ మాట్లాడుతూ రాజకీయపరమైన ప్రకటనలు, సంబంధిత అంశాలను పరిశీలించి వాటిని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపడం ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని ఆయన పరిశీలించారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జిపిఎస్ విధానం ద్వారా ఆయా వాహనాలు ఎక్కడున్నది, ఆయా నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణా తీరును సిఇఒ పరిశీలించారు. అనంతరం ఎన్నికల కమిషన్‌కు రోజువారీ నివేదికలు పంపే విభాగాన్ని సిఇఒ సందర్శించారు. ఆయా నివేదికలను నిర్దేశించిన సమయంలో పంపేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పి డి.మేరీప్రశాంతి సిఇఒ ముఖేష్‌కుమార్‌మీనాకు వివరించారు. తొలుత సిఇఒ ముఖేష్ కుమార్‌మీనాకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పూలమొక్కలిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్ఒ డి.పుష్పమణి, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, సి-విజిల్ నోడల్ అధికారి ఎన్ఎస్.కృపావరం పాల్గొన్నారు.

సిఇఒకు కంట్రోల్ రూమ్ పనితీరును వివరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

### స్వీప్ ఫొటో ప్రదర్శనను తిలకించిన సిఇఒ

జిల్లాలో స్వీప్ కార్యక్రమాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టరేట్ కార్యాలయంలో స్వీప్ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన దృశ్య ప్రదర్శన స్టాల్‌ను ఆయన పరిశీలించారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాలపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను, జిల్లా నోడల్ అధికారి డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాధ్‌ను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ శాతం పెంచేలా, ఎథికల్ ఓటింగ్ జరపాలని 40 రోజులుగా 1756 కార్యక్రమాలు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు చేపట్టామన్నారు. 'అమ్మ పిలుస్తుంది' అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా దూరప్రాంతంలో ఉన్న ఓటర్లకు జిల్లా యంత్రాంగం నుంచి ఆహ్వాన పత్రిక పంపి పోలింగ్ రోజు ఓటర్లను పిలిపించి ఓటింగ్‌లో భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. ఆహ్వాన పత్రికతోపాటు ఓటర్ల స్లిప్పులు కూడా పంపాలని సిఇఒ సూచించారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు బాగున్నాయని ఆయన అభినందించారు.

స్వీప్ ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సిఇఒ

# విజయ పాలవ్యాన్‌లో రూ.5.30 లక్షలు

### స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ట్రిబుల్ ఐటి రహదారిలో విజయ పాల వాహనంలో పోలీసులు శుక్రవారం రూ.5.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సిఐ మూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా విజయ పాల వాహనంలో రూ.5.30 లక్షల నగదు గుర్తించి సీజ్ చేశారు. ఆధారాలు చూపించి నగదును తీసుకువెళ్లాలని ఆదేశించారు.

**భీమడోలు:** మండలంలో ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం నిర్వహించిన దాడుల్లో రూ.లక్ష నగదు పట్టుబడింది. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారి ఎ.మాధవరావు తెలిపిన వివరాల మేరకు తణుకు పట్టణానికి చెందిన ఒక వ్యాపారవేత్త తన కారులో తణుకు నుంచి ఏలూరు వెళుతుండగా గుండుగొలను వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా రూ.లక్ష నగదు కారులో ఉన్నట్లు గుర్తించారు. ఎన్నికల నిబంధనల మేరకు ఉండాల్సిన నిర్ణీత మొత్తం కంటే ఎక్కువగా నగదు ఉన్నందున స్వాధీన పరుచుకుని ట్రెజరీకి అందజేసినట్లు ఆయన తెలిపారు.

విజయ పాలవ్యాన్‌లో పట్టుబడిన నగదు

## రఘు రామకృష్ణంరాజుకు అమరావతి రైతుల మద్దతు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అమరావతి రైతుల పోరాటానికి మద్దతుగా నిలబడిన రఘురామ కృష్ణంరాజుకు ఆయా రైతుల పూర్తి మద్దతు ఉంటుందని అమరావతి జెఎసి కమిటీ తెలిపింది. శుక్రవారం రఘు రామకృష్ణంరాజు నివాసం వద్ద ఆయనను అమరావతి రైతులు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి రైతుల జెఎసి ఇన్విటేషన్ కమిటీ ఛైర్మన్ ఆలూరి యుగంధర్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సైకో పాలనకు వ్యతిరేకంగా రఘు రామకృష్ణంరాజు విరోచిత పోరాటం చేశారని కొనియాడారు. రఘు రామకృష్ణంరాజును నిర్బంధించి చిత్రహింసలు పెట్టిశ్రీవ ఏమాత్రమూ భయపడకుండా ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తి అన్నారు. అటువంటి వ్యక్తికి సీటు ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడే వ్యక్తే చట్ట సభల్లో ఉండాలన్నారు. అమరావతి రైతులకు వెన్నుదన్నుగా ఉన్న రఘు రామ కృష్ణంరాజుకు కూటమి అభ్యర్థిగా సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు

మద్దతు తెలుపుతున్న అమరావతి జెఎసి నేతలు, రైతులు

## విద్యుత్ బకాయిల చెల్లింపు

### పిఎఫ్ ఎంఎస్ దగ్గర డిజిటల్ కీ అప్రూవల్ - ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పాలకోడేరు

పంచాయతీలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిల చెల్లింపునకు మార్గం సుగమం అయ్యింది. అమరావతిలో పిఎఫ్ ఎంఎస్ దగ్గర ఎట్టకేలకు డిజిటల్ కీ అప్రూవల్ అయ్యింది. దీంతో విద్యుత్ బకాయిలు చెల్లించే విధంగా పంచాయతీలు చర్యలు చేపట్టారు. పాలకోడేరు మండలంలో 14 పంచాయతీల్లో రూ. కోటీ 60 లక్షల విద్యుత్ బకాయి పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో పాలకోడేరు, విస్సాకోడేరు, వేండ్ర గ్రామ పంచాయతీలు సుమారు రూ.8 లక్షల 62 వేలు చెల్లించాయి. మిగిలిన పంచాయతీలు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం, పంచాయతీ, సచివాలయ కార్యాలయాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీకి కరెంట్ కష్టాలు శీర్షికన ప్రజాశక్తి కథనాన్ని శనివారం ప్రచురించింది. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సుమారు నెల 15 రోజుల నుంచి నిలిచిపోయిన డిజిటల్ కీ సేవలను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టారు. అమరావతిలో పిఎఫ్ ఎంఎస్ వద్ద డిజిటల్ కీని అప్రూవల్ చేసి కింద స్థాయికి పంపించారు. దీంతో సర్పంచులు విద్యుత్ బకాయిల చెల్లింపులకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పెన్నాడ పంచాయతీ రూ.2.17 లక్షలు, గొరగనమూడి రూ.32 వేలు చెల్లించాయి. మిగిలిన పంచాయతీలు కూడా మరో రెండు రోజుల్లో విద్యుత్ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టారు. శనివారం పంచాయతీ కార్యాలయాలకు విద్యుత్ సేవలను పునరుద్ధస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

# బాధిత మహిళకు అండగా ఉంటాం

### మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక 27వ డివిజన్ కంద్రికగూడెం సెంటర్‌లో వెంకటేశ్వరస్వామి గుడి వద్ద జరిగిన దాడిలో గాయపడిన మహిళ అచ్యుతకుమారిని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ అచ్యుతకుమారిపై దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని, సంఘటనపై విచారణ త్వరితగతిన పూర్తి చేసి నిందితుడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి దృష్టికి తీసుకెళ్తామన్నారు. వృద్ధ మహిళపై కిరాతకంగా దాడి చేయడం దారుణమన్నారు. దాడికి కారకుడైన టిడిపి నాయకుడు రెడ్డి నాగరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి బాధితురాలికి ఫోన్ చేసి రాజీ చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



మాట్లాడుతున్న గజ్జల వెంకటలక్ష్మి

# మోడీ దోస్తులను ఓడించండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోడీ దోస్తులైన బాబు, జగన్, పవన్‌లను ఓడించి ఇండియా వేదికను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బర్రింకలపాడులో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి బరిలో ఉండాలనే ఆలోచనలో ఉన్నామన్నారు. దీనిపై వేదికలోని ఇతర పార్టీలతో చర్చిస్తున్నామని, త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. దేశంలో మతోన్మాద బిజెపి ప్రమాదకరంగా ఉందన్నారు. బిజెపితో రాష్ట్రంలో టిడిపి, జనసేన ప్రత్యక్షంగా జత కట్టగా, వైసిపి పరోక్షంగా జతకట్టి రాష్ట్ర ప్రజలను మోసగిస్తుందని విమర్శించారు. బాబు, పవన్, జగన్‌లకు ఓట్లేస్తే మోడీకి వేసినట్లేనన్నారు. మోడీని ఓడించాలంటే ఇండియా వేదికను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. పోలవరం నియోజకవర్గం రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందని, ఇక్కడ నిర్వాసితుల సమస్యలు, ప్రాజెక్టు నిర్మాణం, భూసమస్యలు, నిరుద్యోగం వంటి అనేక సమస్యలు పేరుకుపోయాయన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే ఇండియా వేదిక అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడుతూ నాలుగుసార్లు ఎంఎల్‌ఎగా పని చేసిన తెల్లం బాలరాజుపై నియోజకవర్గంలో అసంతృప్తి పెరగడంతో భార్యకు సీటు తెచ్చుకున్నారని విమర్శించారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, మండల కమిటీ సభ్యులు సీతారామయ్య, ఎన్‌వి.అప్పారావు, కొండలరావు కారం దుర్గ, రాజమండ్రి దానియేలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవి

# హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక కలెక్టరేట్‌లో ఈ నెల 30వ తేదీ శనివారం జరగనున్న న్యాయమూర్తుల కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్‌కు శుక్రవారం రాత్రి స్థానిక జిల్లా గెస్ట్‌హౌస్‌లో జిల్లా జడ్జి సి.పురుషోత్తమకుమార్, అదనపు ఎస్పి స్వరూపరాణి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ స్వాగతం పలికారు. కృష్ణమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అదేవిధంగా మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, ఇతర న్యాయమూర్తులు హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు.

హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న జిల్లా జడ్జి

కవాతు నిర్వహిస్తున్న డిఎస్‌పి, సిబ్బంది

## ఓటర్లను ప్రలోభ పెడితే కఠిన చర్యలు

### డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు

**ప్రజాశక్తి - మండవల్లి**

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు సమస్యాత్మ గ్రామాలైన భైరవపట్నం, పెరికే గూడెం, ఉనికిలి గ్రామాల్లో సిఐఎస్‌ఎఫ్ బలగాలతో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ఎన్నికల కమిషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టిందన్నారు. ఈ ఎన్నికల్లో ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఒటటరు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఓటర్లు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ధైర్యాన్ని కల్పించడానికి పోలీసు కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ కుమార్, ఎస్ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

## వైసిపి గెలుపునకు కృషి

### సచివాలయ కన్వీనర్ రాంబాబు

**ప్రజాశక్తి - చింతలపూడి**

మండలంలో అందరి నాయకులను కలుపుకొని, పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని చింతలపూడి మండల సచివాలయ కన్వీనర్ మామిళ్లపల్లి రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్‌గా నియమించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబుకి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయ రాజు, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలు జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు.

సీజ్ చేసిన జెసిబి వద్ద రెవెన్యూ సిబ్బంది

## చెరువు అక్రమ తవ్వకం అడ్డగింత

### అధికారులచే ఐదు ట్రాక్టర్లు, జెసిబి సీజ్

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ప్రభుత్వ అనుమతులు లేకుండా, గుట్టుచప్పుడు కాకుండా, రాత్రికి రాత్రి అక్రమంగా ఆక్వా చెరువు తవ్వకం పనులు చేపట్టాడు అధికార పార్టీకి చెందిన ఎంఎల్‌ఎ అనుచరుడు. ఈ సంఘటన మండలంలోని వణుదుర్రు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే వణుదుర్రు గ్రామానికి చెందిన బోయిన అప్పన్న అధికార పార్టీకి చెందిన వ్యక్తి. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా చేపల చెరువు తవ్వుతున్నట్లుగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. అందిన సమాచారం మేరకు మండల తహశీల్దార్ కుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది గురువారం అర్ధరాత్రి చెరువు తవ్వకాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చెరువు తవ్వకాన్ని వెంటనే నిలువుగా చేయాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ సిబ్బంది అప్పన్నను హెచ్చరించారు. అయినా అప్పన్న రెవెన్యూ సిబ్బందిపై అధికార పార్టీ నాయకుల నుంచి తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చాడు. ఎన్నికల నియమావళి అనుసరించి అనుమతులు లేకుండా తవ్వకాలు చేయకూడదని మండల తహశీల్దార్ కుమారి తేల్చి చెప్పడంతో అప్పన్న చెరువు తవ్వకాన్ని చేసేది లేక నిలుపుదల చేశాడు. దీంతో తెల్లవారుజామున చెరువు వద్ద ఉన్న ఐదు ట్రాక్టర్లు, ఒక జెసిబిను రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కుమారి ఎస్ఐ డి.వెంకట్ కుమార్‌కు ఫోన్ చేసి సీజ్ చేసిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించాలని ఆదేశించడంతో రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సహాయంతో వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**గతంలో విలేకరులపై దౌర్జన్యం:** బోయిన అప్పన్న కొంతకాలంగా అధికార పార్టీ అండదండలతో గ్రామంలో అక్రమ చెరువుల తవ్వకాలకు శ్రీకారం చుట్టాడు. అధికార పార్టీ అండదండలు పుష్కలంగా తనకు ఉండడంతో తనకు ఎదురు లేదంటూ విర్ర విగిపోతున్నాడు. ఎంఎల్‌ఎ అనుచరుడు అంటూ గ్రామంలో అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా రెవెన్యూ సిబ్బందిని బెదిరిస్తూ చెరువుల తవ్వకాలు చేస్తున్నాడు. గత జనవరిలో అనుమతులు లేకుండా, నిబంధనకు విరుద్ధంగా అక్రమ చెరువు తవ్వకం చేపడుతున్న విషయం తెలుసుకున్న పలువురు విలేకరులు అప్పన్నను ప్రశ్నించగా వారిపై తన అనుచరులతో కలిసి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. అధికార పార్టీ మాది, నాకు ఎంఎల్‌ఎ అండదండలు ఉన్నాయంటూ రెవెన్యూ అధికారులను బెదిరిస్తూ, ఏమాత్రం లెక్క చేయకుండా విర్రవీగిపోతున్నాడు.

# నిర్మానుష్యంగా ప్రభుత్వ కార్యాలయం

### ఎన్నికల కోడ్ పేరుతో ప్రజలకు అందుబాటులో లేని అధికారుల
### ఇబ్బంది పడుతున్న ప్రజానీకం

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ పేరుతో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. ప్రజలకు ముఖ్యమైన మండల రెవెన్యూ కార్యాలయంలో 11 గంటలకు కూడా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, డిటిలు విధుల్లోకి రావడం లేదు. ఎంఆర్ఒ సెలవుల్లో ఉన్నారు. ప్రజల కోసం, ప్రజల కొరకు పనిచేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉంటూ లబ్ధిదారులకు గౌరవ ప్రదమైన సమాధానం కూడా చెప్పడం లేదు. మొన్నటి దాకా ప్రభుత్వం వాలంటీర్స్ ద్వారా ఇన్కమ్, క్యాస్ట్, తదితర సేవలు అందించడంతో ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం ఏర్పడలేదు. ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో వాలంటీర్ వ్యవస్థను జిల్లా రిటర్నింగ్ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. అసలు కష్టాలు ఇక్కడే మొదలయ్యాయి. ప్రజలకు, పంచాయతీ పరిధిలో ఉన్న సెక్రటరీ, విఆర్ఒ, డిజిటల్ అసిస్టెంట్, మహిళ కానిస్టేబుల్, ఎఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇలాంటి వ్యవస్థలు ఉన్నాయన్నది కూడా ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలు వారి అవసరం కోసం కార్యాలయాలకు వెళ్తే అక్కడి సిబ్బందితో చీదరింపులు ఎదుర్కొంటున్నారు. వారు ఏదైనా సమస్య కోసం వస్తే దానికి సంబంధించిన అధికారికి ఎలక్షన్ డ్యూటీ వేశారు, రెండు నెలలు దాకా అందుబాటులో ఉండరని సమాధానం చెబుతున్నారు. అత్యవసరమైన డెత్ సర్టిఫికెట్లు కూడా జారీ చేయని పరిస్థితి. ఒక్కోసారి వీరు ఎవరి కోసం పని చేస్తున్నారో తెలియని దుస్థితి నెలకొంది. ఇది మండల వ్యాప్తంగా జరుగుతున్న తంతు.

సిబ్బంది రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున, ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడం వల్ల సర్టిఫికెట్ల జారీ విషయంలో మరింత జాప్యం ఏర్పడింది. ప్రజలకు వారికి వచ్చిన సమస్యకు దాన్ని ఎవరు తీరుస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఆ అధికారిని పట్టుకోవడానికి రోజులు తరబడి సమయం పడుతుందని ప్రజలు వాపోతున్నారు. ఎలక్షన్ పరిధిలో అధికారులు ఉన్నా, ప్రజల కోసం ఆ అధికారులు ఏ సమయంలో అందుబాటులో ఉంటారో, ఏ అధికారి లీవ్‌లో ఉన్నారు అని డైలీ రిపోర్ట్ పెడితే ప్రజలకు చాలా సౌలభ్యంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. సమాధానం కూడా సౌమ్యంగా చెప్పాలని, ఆ ముఖ్యమైన అధికారి ఎక్కడ ఉన్నాడో తెలుసుకొనే విధంగా, వారి మొబైల్ నంబర్స్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న రెవెన్యూ కార్యాలయం

# పలుచోట్ల టిడిపి ఆవిర్భావ వేడుకలు

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

42వ టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏలూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణయ్య, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టిడిపిని గెలిపించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పాల జగదీష్ బాబు, బిసి రాష్ట్ర సాధికార సమితి కన్వీనర్ పట్నాల వెంకటేష్ బాబు, నాయకులు దాసరి ఆంజనేయులు, మారడాని రంగారావు, వీరంకి త్రినాధ్ పాల్గొన్నారు.

**ద్వారకా తిరుమల:** 42వ టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని వేంపాడు గ్రామంలో ఘనంగా జరిగాయి. పార్టీ మండల అధ్యక్షులు లంక సత్యనారాయణ ఆధ్వర్యంలో గోపాలపురం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు పార్టీ జండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి, మాజీ జెడ్‌పిటిసి ఏపూరి దాలయ్య పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల: వేంపాడులో ఆవిర్భావ వేడుకలు

**ముసునూరు:** టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం మండలంలోని 16 గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గుడిపాడు గ్రామంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు మాట్లాడుతూ మహా నాయకుడు ఎన్‌టిఆర్ ప్రవేశపెట్టిన టిడిపిని చంద్రబాబు నాయుడు ఆయన లక్ష్యాలతో కొనసాగిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి చేయూతనందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు దేవినేని డలరామ్, కొల్లి గంగారం, మందలపు ధర్మరాజు, మందలపు బుజ్జి, మసిముకు సుబ్బారావు, మెదరమెట్ల సురేంద్ర, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, గద్దల సుహాసిని మోహన్ రావు పాల్గొన్నారు.

**ఏలూరు టౌన్:** టిడిపి పుట్టిందే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసమని దెందులూరు టిడిపి గ్రామ అధ్యక్షుడు, దెందులూరు నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్ ఇప్పిలి వెంకటేశ్వరరావు యాదవ్, నియోజవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి గారపాటి కొండయ్య చౌదరి అన్నారు. మహిళలకు ఆస్తులలో సమానహక్కు ఇచ్చి, మహిళలు అన్ని రంగాల్లో ఆదుకున్న పార్టీ టిడిపి అన్నారు. దెందులూరులో టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామంలోని టిడిపి కార్యాలయం వద్ద జెండా వందన కార్యక్రమం టిడిపి నేతలు సంపంగి వేణుగోపాల తిలక్, కొలుసు నాని, గ్రామ సర్పంచి తోట ఏసమ్మ, ఎంపిటిసి పెనుబోయిన శేషా రత్నంల ఆధ్వ ర్యంలో ని ర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా ర్థి సంఘం పిఎన్ఎఫ్ఎస్ ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు పెనుబోయిన మహేష్ యాదవ్, మైనార్టీ సెల్ నియోజవర్గ నాయకులు షేక్ అహ్మద్ జహీర్ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: జెండా ఆవిష్కరిస్తున్న గన్ని, మహేష్

**పోలవరం :** మండల కేంద్రంలో టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొరగం మాట్లాడుతూ కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో తెలుగువారి ఆత్మగౌరవం కాపాడడం కోసం 1982లో టిడిపిని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోలవరంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొరగం

**కలిదిండి :** టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని మట్టగుంటలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ పార్టీ స్థాపించి, తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి, ఆనాడు రాజకీయపరంగా అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని అంద్రాజు తెలిపారు. కొపనాతి వెంకటేశ్వరరావు, కె.శ్రీను, బళ్లా రాజు, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, గోపాల కృష్ణ, మోకా శంకర్, తరగల మోహన్, దున్న రంగారావు పాల్గొన్నారు.

**చాట్రాయి:** తెలుగు వారి ఆత్మ గౌరవమే నినాదంగా, సమాజమే దేవాలయంగా, ప్రజలే దేవుళ్లు అనే భావనతో పేదవాడి కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ కల్పించాలనే పవిత్ర లక్ష్యంతో కీర్తిశేషులు నందమూరి తారకరామారావు టిడిపిని స్థాపించారని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం చాట్రాయి మండలం, చనుబండ గ్రామంలో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తిశేషులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఫ్రూట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో ఫిరంగి పుల్లయ్య, తీర్థాల అబ్బుత రావు, పరసా నాగ వెంకట శ్రీనివాసరావు, గవర వెంకటేశ్వరరావు, దేసిన చెన్నారావు పాల్గొన్నారు.

ముసునూరులో..

**చింతలపూడి :** పేదల సంక్షేమం కోసం టిడిపిని ఎన్‌టిఆర్ ఏర్పాటు చేశారని, పేదలకు రూ.2కే కిలో బియ్యం ఇచ్చామని టిడిపి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో ముద్దరబోయిన

## 'నేటి రాజకీయాలు డబ్బుతోనే..'

**ప్రజాశక్తి - ముసునూరు**

నేటి రాజకీయాలు డబ్బుతో ముడిపడి ఉన్నాయని, ప్రస్తుత రాజకీయ నాయకులు డబ్బుతో ఓట్లు కొని ఆ తరువాత డబ్బును సంపాదించడమే పనిగా పెట్టుకున్నారని, నిశ్వార్థ రాజకీయ నాయకులు కొందరు మాత్రమే ఉన్నారని మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామంలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బుతో ముడిపడి ఉన్నాయని, ఎంఎల్‌ఎలు, ఎంపీలు అవ్వాలంటే కోటీశ్వరులు అయితేనే పార్టీలు టికెట్లు ఇస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో రాజకీయాలకు స్వస్తి పలకాలని అనుకున్నా తమను నమ్మి ఉన్న కార్యకర్తలను వదలలేక రాజకీయాలను కొనసాగిస్తున్నానన్నారు. 10 సంవత్సరాల పాటు నూజివీడులోని ప్రతి గడపకు వెళ్లి టిడిపి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి, అహర్నిశలు కష్టపడ్డానన్నారు. తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## కుల దూషణ కేసుపై డిఎస్‌పి విచారణ

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని వైవాక గ్రామానికి చెందిన పెయ్యల పౌలు అదే గ్రామానికి చెందిన కూరపాటి వెంకటేశ్వరరావు, మరికొందరు వ్యక్తులు తనను కులం పేరుతో తిట్టి దూషించినట్లు ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశాడు. కేసు విచారణలో భాగంగా దర్యాప్తు అధికారి, ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు శుక్రవారం వైవాక వచ్చి, ఫిర్యాదుదారుడు పౌలును విచారించారు. అనంతరం కూరపాటి వెంకటేశ్వరరావును దర్యాప్తు అధికారి విచారించారు. గ్రామ విఆర్ఒ ఫణి సమక్షంలో పరిశీలించి ఫిర్యాదుదారున్ని డిఎస్‌పి విచారించారు.

**IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, II ADDNL, DISTRICT JUDGE: AT: KHAMMAM**
**M.A.T.O.P.NO. 318 OF 2022**

BETWEEN:-
Sariyam Veeravenkatamma and others
.....Claim Prltitioners
AND
R. Achuthakumar & Others
.....Respondents

To
**Respondent No.4**
Irapa Rambabu, S/o. Balaiah, Age: Major, Occ: Driver-cum-owner of Auto bearing No, AP 39 TK -3929, R/o. H. No. 8-62, Alligudem, Kukunoor Mandal, Pedaravigudem, West Godavari Dist, A.P. -507114,

Take Notice that the above named Claim Petitioners have filed the above O.P.against the respondents claiming compensation. The above case is stands posted to **18-04-2024** for your appearance. Therefore, you are here by directed to appear before the Hon'ble court on **18-04-2024 at about 10-30 A.M.** in person or through an advocate without fail. Failing which the matter will be decided ex-parte against you.

//By order of the Hon'ble court//
28-03-2024
Khammam.

**YEGINATI NAGESWAR RAO**
Advocate, Khammam
**CELL No.98483 68823**

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**
**E.P. No. 02/2017 in O.S. 476/2005**

బిట్వీన్:
పద్మనాభుని నాగేశ్వరరావు -వాది/ DHR
అండ్
1. మామిడి సత్య వరప్రసాద్
2. మామిడి వెంకటకృష్ణ
-ప్రతివాదులు/ JDRs

పై నెంబరు E.P. గ్రంధములో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 16-04-2024 సం॥రం తేదీన** శ్రీయుత పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయబడును. కావలసినవారు సదరు వేలం పాటలో పాల్గొని సదరు ఆస్తిని కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

**షెడ్యూలు:** పశ్చిమగోదావరి జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రరీ, ఉంగుటూరు మండలం, నల్లమాడు గ్రామపంచాయతి పరిధిలోని ఆర్.ఎస్. నెం. 103/2ఎ లోని య. 4.34 సెంట్లు ఈ భూమికి హద్దులు.
**తూర్పు:** గౌతు సత్యనారాయణ భూమి.
**దక్షిణం:** వడ్లమూడి నరసింహమూర్తి భూమి.
**పడమర:** కాండేపు సుబ్బారావు భూమి.
**ఉత్తరం:** సుంకరవల్లి రామచంద్రరావు భూమి.
ఈ హద్దుల మధ్య య. 4.34 సెంట్లు భూమి.
*వాది నిమిత్తం: రూ. 4,00,000/-*
*అమీనా విలువ: రూ. 9,00,000/-*

**దాసరి ఫణిభూషణ ప్రసాద్**
DHr తరపు అడ్వకేట్
తాడేపల్లిగూడెం వేలంపేట, పెంటపాడు
ది.29-3-2024 సెల్: 9849216746

# పలుచోట్ల 'గుడ్ ఫ్రైడే'

ముదినేపల్లిలో..

**ప్రజాశక్తి - చింతలపూడి**

అన్ని మతాలు సమానమే, అందరం అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉండాలని మసీదు కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ రహీమ్, జమతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు ఎస్‌కె.హుస్సేన్, చింతలపూడి ఆర్‌సిఎం చర్చి ఫాదర్ కామ మ్యాత్యూ అన్నారు. చింతలపూడి పట్టణంలో గుడ్ ఫ్రై డే సందర్భంగా చింతలపూడి ఆర్‌సిఎం చర్చి ఫాదర్ కామ మ్యాత్యూ అధ్వర్యంలో వందల మంది క్రైస్తవ విశ్వాసకులు ర్యాలీగా మండుటెండలో ప్రార్ధనలు జరుపుతూ పట్టణలో ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ మ్యాత్యు శిలువను మోస్తూ యేసు చేసిన త్యాగాలను వివరించారు. మండుటెండల్లో శిలువతో వెళ్తున్న క్రైస్తవ విశ్వాసకులకు చింతలపూడి పట్టణ ముస్లింలు బాసటగా నిలిచారు. సోదర భావంతో క్రైస్తవ విశ్వాసలకు తమ వంతుగా శీతల పానీయాలను సుమారు పదిహేను వందల మందికి అందించి తమ సోదర భావం చాటారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎమ్‌డీ అక్బర్ అలీ, ఎమ్‌డీ జిలానీ, సయ్యద్ ఖాజా, ఆజాద్, హాజీ, రజాక్, నవాబ్, ఇమ్రాన్, బక్షూ, రఫీ, బషు, ముజాహిద్ అబిద్, అస్లం, రఫిక్ పాల్గొన్నారు.మండలంలోని ఫాతిమాపురం, ప్రగడవరం, అంథోనీ నగర్‌లోని పలు గ్రామాల్లో పరిశుద్ధ సిలువ మార్గంలో చింతలపూడి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొంగ రోషన్ కుమార్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే మన కోసం యేసు చేసిన అపారమైన త్యాగాన్ని గుర్తుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేటీర్ ఫాదర్ పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే సందర్భంగా నియోజవర్గ వైసిపి అభ్యర్థి కంభం విజయ రాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని ధర్మాజీగూడెం ఆర్‌సియం చర్చి ఆధ్వర్యంలో గ్రామంలో సిలువ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయనతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం టౌన్:** జంగారెడ్డిగూడెంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్‌సియం చర్చి ఫాదర్ కళ్యాణ బాబు ఆధ్వర్యంలో వందలాదిమంది క్రైస్తవ విశ్వాసకులు ర్యాలీగా జంగారెడ్డిగూడెం ప్రధాన వీధుల్లో ప్రార్ధనలు జరిపారు.

**నూజివీడు రూరల్:** నూజివీడు పట్టణంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ సోదరులు పవిత్ర సిలువ మార్గాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తి గీతాలు ఆలపిస్తూ పట్టణంలోని ప్రధాన రహదారులలో భారీ సిలువను మోస్తూ క్రైస్తవ భక్తులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిఎం, ఎల్ఎఫ్, పెంతుకోస్తు సంఘాలు పాల్గొన్నాయి.

**టి.నరసాపురం:** మనుషుల ప్రయాసలు, పాపభారం తొలగిపోవాలని కోరుతూ మనుష్యుని రూపంలో జన్మించిన యేసుక్రీస్తు ప్రభువు శిలువ వేయబడ్డారని, అందుకే శుక్రవారము క్రైస్తవ విశ్వాసులు గుడ్ ఫ్రైడే నిర్వహిస్తారని పాస్టర్ జి.జ్ఞాన్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రకాష్ నగర్‌లో షాలేము ప్రార్ధనా మందిరం సంఘవిశ్వాసులు పాస్టర్ జి.జ్ఞాన్ రాజు ఆధ్వర్యంలో శాంతి యుత ర్యాలీ నిర్వహించి, ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అదేవిధంగా టి.నరసాపురం, బొర్రంపాలెం, తెడ్లెం గ్రామాల్లో ఆర్‌సిఎం, సిఎస్ఐ సంఘాల వారు శిలువ చెక్క మోస్తూ ర్యాలీ ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు కె.నిరీక్షణ రావు, సిహెచ్ హోషేయ, బ్రదర్ అనిల్, సిహెచ్.రమేష్, వై.పాల్ పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం రాత్రి నుంచి గుడ్ ఫ్రైడే ప్రత్యేక ఆరాధనలు పలు చర్చిల్లో నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు క్రైస్తవులు ప్రార్ధన మందిరాల్లో చేరి ప్రత్యేక ఉపవాస ప్రార్ధనలు చేశారు. గ్రామంలోని పురవీధుల్లో సిలువను మోస్తూ ఊరేగింపు చేశారు. వందలాది మంది క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

**రెండువేల పులిహోర ప్యాకెట్లు పంపిణీ**

గుడ్ ఫ్రైడే సందర్భంగా ఉపవాస దీక్షల్లో ఉన్న క్రైస్తవ సోదరులకు శుక్రవారం పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముదినేపల్లికి చెందిన సేవా రవి ఆధ్వర్యంలో ముదినేపల్లిలోని ఆర్‌సిఎం చర్చితోపాటు వివిధ చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న వారందరికీ పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముదినేపల్లిలోని ఆర్‌సిఎం, పెంతుకోస్తు, ఎల్ఇఎఫ్, బాప్టిస్ట్, క్రీస్తు సంఘం పెనుయేలు ప్రార్ధన మందిరం తదితర చర్చిల్లో 2 వేల మందికిపైగా ఉపవాస దీక్షలో ఉన్న క్రైస్తవులకు పులిహోర ప్యాకెట్లను సేవా రవి అందజేశారు.

**ముసునూరు:** భక్తిశ్రద్ధలతో ప్రజలు ఉన్నట్లయితే ఎటువంటి ఆటంకాలు లేకుండా సుఖ సంతోషంతో ఉంటారని ఫాదర్ జోసెఫ్ తంబి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని 16 గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రధాన చర్చిలలో ప్రార్ధన నిర్వహించారు. కాట్రేనీపాడు గ్రామంలో నూజివీడు మార్కెట్ యార్డు ఛైర్మన్ కంబాల కృష్ణవేణి రాంబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**జీలుగుమిల్లి :** మండలంలోని దర్బగూడెం, జీలుగుమిల్లి, ములగలంపల్లి, కామయ్యా పాలెం గ్రామాల్లోని పలు ప్రార్ధనా మందిరాల్లో పవిత్ర శుక్రవారం(గుడ్ ఫ్రైడే) సందర్భంగా క్రైస్తవులు సిలువ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణకర్తలు మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువ శ్రమలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు పవిత్ర శుక్రవారన్ని జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల విచారణకర్తలు, సంఘ పెద్దలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

చింతలపూడి: సిలువను మోస్తున్న టిడిపి అభ్యర్థి రోషన్

**కలిదిండి :** గుడ్ ఫ్రైడే వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. స్థానిక ఆర్‌సిఎం చర్చి ఫాదర్ రెవరెండ్ బంటుమిల్లి యోహాను ఆధ్వర్యంలో పురవీధుల్లో శిలువ మార్గం నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలోని క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి:** మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా సిలువమార్గం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువు అల్లం ప్రతాప్‌రెడ్డి, సహాయ గురువు సతీష్, పిన్నమరెడ్డిపల్లి సర్పంచి జె.భూషణం, మాజీ సర్పంచి జె.కోటేశ్వరరావు, పావన సుజన కుమారి, టి.నరశింహారావు, ఆగిరిపల్లి, రాజవరం, పిన్నమరెడ్డిపల్లి, తోటపల్లి, చొప్పరమెట్ల, చిన్నాగిరిపల్లి సంఘస్తులు పాల్గొన్నారు.

**చాట్రాయి:** గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు ప్రభువు మోసిన సిలువతో క్రైస్తవ విశ్వాసులు బహిరంగంగా ఆయనను అనుసరిస్తూ గ్రామంలోని పురవీధుల్లో పారిశుద్ధ సిలువ మార్గాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి విచారణ కర్తలు ఫాదర్ పోలిశెట్టి జయరాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిస్టర్స్, ఉపదేశి మాస్టార్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

**గ్రామపంచాయతీ కార్యాలయము, పిన్నమరెడ్డిపల్లి**
**టెండరు ప్రకటన**
ఆర్.సి. నెం./2024 తేది.29-03-2024

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, పిన్నమరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఈ క్రింది షెడ్యూలు దాఖలు రోజువారి పనుల నిమిత్తం అనుభవము గల ఏజెన్సీలు కాంట్రాక్టర్లు/ వ్యక్తుల నుండి ది. 31-03-2024వ తేది మధ్యాహ్నం గం॥ 12.30ల వరకు సీల్డు టెండర్లు ఆహ్వానించడం అయినది. దాఖలైన టెండర్లను అదేరోజు సాయంత్రం గం॥ 03.00 ని॥లకు అప్పటి వరకు వచ్చిన టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరవబడును. ఇతర వివరములు కార్యాలయము పనివేళ యందు తెలుసుకొనవచ్చును. దాఖలైన టెండర్లు ఆమోదించుట లేదా తిరస్కరించుట లేదా రద్దుపరచుటకు గ్రామపంచాయతీ వారికి పూర్తి అధికారము కలదు. ధరావతు చెల్లించని టెండర్లు పరిశీలించబడవు.

| నెం. | పనుల వివరములు | పనిచేయవలసిన కాలము | చెల్లించవలసిన ధరావతు |
|---|---|---|---|
| 1 | ట్యాంకు వాచర్లు ఇద్దరు (02) వ్యక్తులు | ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు | రూ.500/-లు లేదా హామీ పత్రము |
| 2 | స్వీపరు ఒకరు (01) వ్యక్తులు | ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు | రూ.500/-లు లేదా హామీ పత్రము |

*గమనిక: 1. అనుభవము బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. నెలవారి చెల్లింపులు గ్రామపంచాయతీ సాధారణ నిధులు లభ్యతలను అనుసరించి చెల్లించబడును. 3. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వ్యక్తి ఒక్కింటికి నెలకు రూ. 8,000/-లు మించకుండా రోజువారీ దామాషా లెక్కన టెండరు దాఖలు చేయవలెను.*

సం/- **సిహెచ్.పుల్లారావు,** పంచాయితీ కార్యదర్శి
పిన్నమరెడ్డిపల్లి, ఆగిరిపల్లి మండలం

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814